సమావేశంలో మాట్లాడుతున్న బలాష్ఠి రమేశ్

భూముల వేలాన్ని విరమించుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 31 : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్ఠి రమేశ్ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పే విధానాన్ని మానుకోవాలని, విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. గతంలో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని భూములు కేటాయిస్తే, అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం సరైన చర్య కాదన్నారు. ప్రజా సంఘాలు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, విష్ణువర్ధన్, భిక్షపతి, గోవర్ధన్, రమేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మరిపెడ, మార్చి 31 : మండలంలోని తండా ధర్మారం గ్రామానికి చెందిన గుగులోత్ జగన్నాథం ఇటీవల మృతిచెందారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు సోమవారం మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రామడుగు అచ్యుత్‌రావు, మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, గుగులోత్ రాంబాబు, బాలకిషన్, బాబు, నెహ్రూ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

తొర్రూరు సీఐ గణేశ్

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తొర్రూరు సీఐ గణేశ్

తొర్రూరు, మార్చి 31 : సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో తొర్రూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గణేశ్ వాల్ పోస్టర్లను సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అకాడమీ డైరెక్టర్, యువ కవి, పున్నమి వెన్నెల ఫేమ్ చిర్ర సతీశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ప్రజలు అనుమానాస్పద లింక్స్ క్లిక్ చేసి, ప్రమాదంలో పడొద్దన్నారు. సైబర్ యోధుడు సతీశ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత సమాచారం (ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలు, పాన్ నంబర్, ఏటిఎం పిన్) ఎవరికీ చెప్పొద్దని హెచ్చరించారు. దేశం ఏటా వందల కోట్ల రూపాయలు సైబర్ నేరాల వల్ల నష్టపోతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, రాంజీనాయక్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఇంగ్లిష్ సదస్సులో రాజేశ్

మండల ప్రజలు, విద్యావంతుల హర్షం

బీ రాజేశ్

కురవి, మార్చి 31 : కురవి మండల కేంద్రానికి చెందిన భూముల రాజేశ్ ఆదివారం ఆన్‌లైన్‌లో జరిగిన అంతర్జాతీయ ఇంగ్లిషు సదస్సులో పాల్గొని తన పరిశోధనా పత్రాన్ని సమర్పించాడు. రాజేశ్ వరంగల్ దేశాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ... ఇంగ్లిషు గ్రామర్ నేర్చుకోవడంలో విద్యార్థుల మాతృభాషా ప్రభావం అనే అంశంపై తన పరిశోధన పత్రం అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైనట్లు తెలిపారు. తన పరిశోధనకు ఆంగ్ల ఉపాధ్యాయుడు వంగర లక్ష్మణ్ మెంటర్‌గా వ్యవహరించారన్నారు. తెలుగు, ఉర్దూ, లంబాడ మాతృభాషలుగా ఉన్న విద్యార్థులు ఇంగ్లిషు నేర్చుకోవడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని...వారికి ఇంగ్లీషు పట్ల మక్కువ కలిగేలా తన పరిశోధన దోహదపడుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడి పరిశోధన పత్రం అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక కావడం పట్ల దేశాయిపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం చక్రపాణి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా కురవి మండలంతోపాటు జిల్లా కు చెందిన విద్యావేత్తలు, రాజేష్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకం

★హన్మకొండ సమీపంలోని యాదవనగర్ పెట్రోల్ పంప్ రెడ్డిపురం ప్రాంతంలో సాయికృపా కాలనీలో రెండు కొత్త తూర్పు ముఖంగా187 గజాల ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. Cont: VRN Developers & Builders-9700101918.
NTW-332491

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

WANTED HOSPITAL STAFF

jobs Apply Now!

★LAB-TECHNICIANS (Exp.) OT-TECHNICIANS, MEDICAL SHOP BOYS (Exp.) & Aayammas. Cont: Guardian Hospital, Mulugu 'x' Road, Warangal. 12 to 2 pm.
NTW-496

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మహబూబాబాద్ రూరల్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు


చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే రెడ్యా

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: పవిత్ర రంజాన్(ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లింలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు అలయ్ బలయ్ తీసుకున్నారు. తమ పూర్వీకుల సమాధులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహబూబాబాద్ పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని కలిగి ఉండాలని, రంజాన్ పండుగను సంబురంగా జరుపుకోవాలన్నారు. మరిపెడ మండలంలో బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ లతీఫ్ హౌసింగ్ బోర్డ్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ శాంతి, సమానత్వానికి ప్రతీక అని అన్నారు. చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లిలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను పలువురు ముస్లింలు మర్యాదపూర్వకంగా కలువగా, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకుంటున్నట్లు తెలిపారు.

మరిపెడ: శుభాకాంక్షలు తెలుపుతున్న గుడిపూడి నవీన్‌రావు

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- దుంగలుగా మార్చి.. ఇటుక బట్టీలు, బొగ్గు తయారీ కేంద్రాలకు తరలింపు
- అనుమతులు లేకుండా దళారుల అక్రమ దందా
- పట్టించుకోని అధికార యంత్రాంగం

తరలించేందుకు సిద్ధంగా ఉన్న దుంగలు

చిన్నగూడూరు, మార్చి 31 : మండలంలోని ఉగ్గంపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా చెట్ల నరికివేత కొనసాగుతున్నది. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు పెద్ద పెద్ద చెట్లను నేల కూల్చి సొమ్ము చేసుకుంటున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. చెట్లను నరికి దుంగలను ఇటుక బట్టీలు, బొగ్గు తయారీ కేంద్రాలు, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఓ యజ్ఞంలా నిర్వహించింది. పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని చేపట్టింది. ప్రస్తుతం అవి ఎదిగి వృక్షాలుగా మారగా, కొందరు అక్రమార్కుల దృష్టి వాటిపై పడింది. కొందరు అధికారులతో ఒప్పందం చేసుకొని దళారులు ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేస్తున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఫారెస్ట్, జీపీ అధికారులు స్పందించి అక్రమార్కుల నుంచి పచ్చని చెట్లను కాపాడాలని కోరుతున్నారు.

గూడూరు: నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

కురవి: ఈద్గాలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూనే ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన

కురవి/డోర్నకల్/నెల్లికుదురు, మార్చి 31 : కురవి, సీరోలు మండలాల్లో ముస్లింలు పవిత్ర రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కురవి మండల కేంద్రంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు చట్టానికి వ్యతిరేకంగా ముస్లింలు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూనే ప్రార్థనలో పాల్గొన్నారు. వక్ఫ్ అమండ్‌మెంట్ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం ముస్లింలు డోర్నకల్ మండలంలోని ఈద్గా వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ముస్లింలు చేతికి నల్లరిబ్బన్లు ధరించి రంజాన్ ప్రార్థనలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అప్సర్ పాషా, జహుర్‌పాషా, అజ్గర్లి, యాకూబ్ పాషా, దావుద్, ఇమ్రాన్, సహీర్‌పాషా పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు, మార్చి 31 : వక్ఫ్ బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా రంజాన్ పండుగ రోజు ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక పాకాల వాగు సమీపంలో ఉన్న ఈద్గా వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ.. తరాలుగా వక్ఫ్‌బోర్డు ద్వారా ముస్లింలకు సంబంధిన ఆస్తులు రక్షించబడుతున్నాయని, వీటిని కేంద్రం స్వాధీనం చేసుకొని ఇతరులకు ఇచ్చేందుకు సన్నాహాలు చేయడం తగదన్నారు. ముస్లింలను అణగదొక్కే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు సలీం, ఖాసీం, ఇజాజ్, ఖదీర్, కరీం, రహెమత్‌బాబా, అహ్మద్, రహీం, యాకూబ్, ఆజాం, అంజత్, చాంద్ పాల్గొన్నారు.

దవడ పగులుద్ది.. బయటికెళ్లు..?

- కాంగ్రెస్ కార్యకర్తపై ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ చిందులు
- ఆగ్రహంతో బయటికి వెళ్లిన కార్యకర్త

సమావేశం నుంచి బయకు వెళ్లిపోతున్న కార్యకర్త

నర్సింహులపేట, మార్చి 31: సమస్య చెబుతున్న సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తపై డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రూనాయక్ 'దవడ పగులుద్ది.. బయటికెళ్లు' అని అనడంతో అవాక్కయిన కార్యకర్త అగ్రహంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. సోమవారం నర్సింహులపేట మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పెద్దనాగారం స్టేజీ జీపీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బొబ్బ అశోక్‌రెడ్డి 10 ఏళ్లగా పార్టీ కోసం పని చేస్తున్నానని, ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు ఇవ్వలేదని అడిగాడు. ఎమ్మెల్యే రామచంద్రునాయక్ కల్పించుకొని 'దవడ పగులుద్ది.. ఇక్కడి నుంచి వెళ్లిపో' అన్నాడు. ఆవేశంతో సమావేశం నుంచి వెళ్లిపోతూ ఎమ్మెల్యే కాకముందు ఎట్లుంటువి? ఇప్పుడు ఇట్లా మాట్లాడుతవా? వెళ్లకపోతే ఇక్కడ ఉంటానా? అంటూ బయటకు వెళ్లిపోయాడు. అనంతరం అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు రైతు భరోసా, రుణమాఫీ కాలేదు. సమస్యలు చెప్పేందుకు వెళ్తే మరిపెడ క్యాంపు కార్యాలయం, మండలానికి, గ్రామాలకు వచ్చినప్పుడు సమస్యలు చెప్పనీయడం లేదు. 10 ఏళ్లుగా పని చేసిన నాకు ఇచ్చే మర్యాద ఇదేనా? అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

జయపురంలో వరిని కోస్తున్న హార్వెస్టర్

యాసంగి వరి కోతలు షురూ

నర్సింహులపేట, మార్చి 31 : మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు, బావులు, బోర్ల కింద రైతులు వరిసాగు చేశారు. పంట చేతికోస్తున్న సమయంలో సాగునీరు అందక చాలా గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఉన్న కొద్దో గొప్పో చేతికొచ్చిన పంటను రైతులు హార్వెస్టర్ సాయంతో కోతలు మొదలు పెట్టారు. గ్రామాల్లో ప్రస్తుతం వ్యాపారులు పచ్చి ధాన్యానికి ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని 8న ధర్నా

తొర్రూరు, మార్చి 31 : ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న పిలుపునిచ్చారు. సోమవారం అమ్మాపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. బూటకపు ఎన్ కౌంటర్లను నిలిపివేయాలన్నారు. కార్పొరేట్ సంస్థల కోసం ఆదివాసీల భూములను లాక్కోవడానికి ప్రభుత్వం 10వేల మంది సైనికులను మోహరిస్తున్నదని ఆయన ఆరోపించారు. అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు పెద్దఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దొనికెన ఎల్లయ్య, సోమయ్య, నాగమ్మ, సోమక్క, దర్గయ్య, ఏసోబు, లక్ష్మి, నారాయణ, ఉప్పలమ్మ, మంగమ్మ, ఉపేంద్ర, కేతమ్మ పాల్గొన్నారు.

మహబూబాబాద్‌లో..

మహబూబాబాద్ రూరల్, మార్చి 31 : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివాసులపై దాడులు, దౌర్జన్యాలు, ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు జరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పుతున్నదని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హలావత్ లింగన్న, దేవేందర్, పాపయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తమ్ముడి పేరుపై సేవాసమితి ఏర్పాటు

కురవి, మార్చి 31: తోడబుట్టిన తమ్ముడి పేరు చిరస్థాయిగా నిలిచిపోవాలనే ఆకాంక్షతో కురవి మండల కేంద్రానికి చెందిన సీహెచ్ శ్రీనివాస్ సోమవారం తన బిడ్డ దుర్గాభాస్కర్ పుట్టిన రోజు సందర్భంగా భాస్కర్ సేవాసమితి పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... చిన్నతనంలో తమకు దూరమైన తమ్ముడు భాస్కర్‌ను మరిచిపోకుండా ఉండేందుకు చిన్నతనం నుంచి ప్రణాళికాబద్ధంగా ముందుకుపోతున్నామన్నారు. తన ఇద్దరు పిల్లలకు దుర్గాభాస్కర్, కన్నాభాస్కర్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు తమ్ముడిపేరుపై ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో సేవాసమితి పేరుతో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామన్నారు.

ఫరీద్‌కు హరీశ్‌రావు శుభాకాంక్షలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 31 : పట్టణ కేంద్రానికి చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్‌కు సోమవారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఫోన్ ద్వారా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఫరీద్ కుటుంబ సభ్యులతోనూ ఫోన్‌లో మాట్లాడి, రంజాన్ పండుగను సంబురంగా జరుపుకోవాలన్నారు.

హామీలు అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వం జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం పట్టణంలో జీపీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జీపీ కార్మికులను పర్మినెంట్ చేసి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత జీతాలే సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. జీపీ కార్మికుల సమస్యలనుపై ఈ నెల 5న నారాయణపేట జిల్లాలో జరిగే మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి, రవి కుమార్, రాజేశ్, రాజు, లక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

డోర్నకల్, మార్చి 31: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన జోగ్యతండాలో సోమవారం జరిగింది. ఎస్సై నాగేశ్వరావు కథనం ప్రకారం... జోగ్య తండాకు చెందిన చందావాత్ రమేశ్ (35) టైలర్ పని చేశాడు. తాగుడుకు బానిసై క్షణికావేశంలో ఈ నెల 29న రావిగూడెం గ్రామ శివారులో మాన్‌సింగ్‌నాయక్ గుడి వద్ద పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ఏరియా వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ ఈ నెల 30న రాత్రి మృతి చెందాడు. రమేశ్ తండ్రి సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కురవి, మార్చి 31 : కందికొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు ఘనాచారి బాబురావు తండ్రి హన్మంతు సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బజ్జూరి పిచ్చిరెడ్డి, కురవి మండల అధ్యక్షుడు తోట లాలయ్య, యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్, కొల్లూరి సురేశ్, బండి మాదయ్య, వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

రెడ్యా పరామర్శ

చిన్నగూడూరు, మార్చి 31 : మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బెల్లంకొండ రామతార అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు.

కాంగ్రెస్‌లో వర్గపోరు

ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారిన వైనం

దంతాలపల్లి, మార్చి 31: మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మధ్య వర్గపోరు తారస్థాయికి చేరి, ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారింది. సోమవారం మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రూనాయక్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొంతమంది మండల నాయకులు పాత కొత్త కాంగ్రెస్ అంటూ వర్గాలు చేస్తున్నట్లు గ్రామస్థాయి నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో జరుగుతున్న పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు తమను పిలువకుండా మండల పార్టీ అధ్యక్షుడు వర్గాలు చేస్తున్నారని యువజన నాయకులు ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లారు. మరికొన్ని గ్రామాల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా, కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి అభివృద్ధి పనులు ఇస్తూ తమను పట్టించుకోవడం లేదన్నారు. ఒకరిపై ఒకరు ఎమ్మెల్యే దగ్గర ఆరోపణలు చేసుకోవడంతో వర్గ పోరు భగ్గుమన్నది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లకపోతే నష్టపోయేది మీరేనని అన్నారు. కాగా, మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించాల్సిన సమావేశం సాయంత్రానికి ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటలకు ఎమ్మెల్యే వచ్చి 9గంటల వరకు సమావేశం నిర్వహించడంతో ఎమ్మెల్యే తీరుపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.

ఇసుక హద్దుల్లో తన్నుకున్నారు..

ఆలస్యంగా వెలుగులోకి..

నర్సింహులపేట, మార్చి 31: అసలే ఇసుక అక్రమ రవాణా.. అందులో 'వాగు మా గ్రామ శివారులో ఉంది.. అంటే మా గ్రామ శివారులో ఉంది.. మేమే ఇసుక ట్రాక్టర్ నింపుతాం' అంటూ ఆదివారం రాత్రి కూలీల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ కాస్త ట్రాక్టర్ యజమానుల మధ్య గొడవకు దారితీసింది. మండలంలోని జయపురం, కౌసల్యదేవిపల్లి శివారు గుండా ఆకేరువాగు ప్రవహిస్తున్నది. ప్రస్తుతం నీళ్లు లేక ఎండిపోయింది. ఇదే అదునుగా దళారులు రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. అయితే, ట్రాక్టర్లలో ఇసుక నింపే విషయంలో కూలీల మధ్య జరిగిన గొడవ ముదిరి, ప్లాస్టిక్ బొచ్చలతో కొట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానులు సైతం తన్నుకున్నారని, మండలంలో ట్రాక్టర్ యజమానులే చెప్పు కోవడం కొసమెరుపు.